సూక్తులు

# సూక్తి సుధ



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని భారత ప్రభుత్వపు వెబ్ సైట్( డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా) నుంచి సేకరించి అందిస్తున్నాము. ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) భారత ప్రభుత్వపు వెబ్ సైట్: http://www.new.dli.ernet.in
2) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
3) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
4) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో భారత ప్రభుత్వపు డిజిటల్ లైబ్రరీ సహాయంతో ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Help Line / WhatsApp: 904 202 0123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు

## భారత ప్రభుత్వపు వెబ్ సైట్ - డిజిటల్ లైబ్రరీ అఫ్ ఇండియా

**http://www.new.dli.ernet.in**



# అతి విశిష్టం ఈ దానం!

స్వామి వివేకానంద

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.



రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖

మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

# సూక్తిసుధ

(విద్యార్థులు ఎల్లకాలం గుర్తుంచుకోదగిన 53 సూక్తులు, వాటి వివరణలు)

రచన :
మన్నవ గిరిధరరావు

*

ప్రథమ ముద్రణ :
అక్టోబరు 1991
అన్నిహక్కులు ప్రచురణకర్తవి.

*

ముద్రణ :
శ్రీ లక్ష్మీగణపతి ప్రెస్
2వ లైను, అరండల్ పేట
గుంటూరు - 2.

*

ప్రతులకు :

మన్నవ గిరిధరరావు,
కార్యదర్శి,
యువభారతి ఎడ్యుకేషనల్ సొసైటీ.
కృష్ణనగర్
గుంటూరు-522 006

**మూల్యము : రూ. 6-00**

# ముందుమాట

దేవాలయ గోపురాన్ని చూచేవారు దాని అగ్రభాగానగల చక్కని శిల్పముల వంక చూస్తారు గాని గోపురము అడుగున గల పునాదిరాళ్ళవంక ఎవరూ చూడరు. కాని, ఆ గోపురం ఎంతో కాలంగా దృఢంగా నిలబడడానికి ఆ పునాదిరాళ్ళే కారణం. అలాగే విద్యఅనే సుందరమైన భవనానికి ప్రాథమిక పాఠశాలే పునాదిరాయి.

అట్టి ప్రాథమిక పాఠశాలల్లో చక్కని ఆలోచనలను రేకెత్తించే సూక్తులను వారానికొకటైనా చెప్పి దాని అర్థాన్ని వివరించినట్లయితే చిన్నారిపాపల మనోవికాసానికి వెలుగుబాటలు వేసే వీలవుతుంది. అందుకుపకరించే ఈ "సూక్తిసుధ"ను సద్వినియోగపరచవలసినదిగా ఉపాధ్యాయ మిత్రులకు మనవి.

—రచయిత

# సూక్తిసుధ

## 1. అమ్మ

**అమ్మ ఒడి ఒక బడి, ఒక గుడి.**

ఇది చక్కని తెలుగు సూక్తి. మాతృమూర్తి యొక్క విశిష్టత ఇందులో చెప్పబడినది.

తల్లి అనగా కేవలం నీళ్ళుపోసి అన్నం పెట్టి దుస్తులు తొడిగే ఒక స్త్రీ మాత్రమే కాదు. ఆమె ప్రేమమూర్తి. మాతృప్రేమతో సాటియైనది లేదు. పుట్టిన ప్రతి బిడ్డకూడా ప్రేమ కొరకు తపిస్తుంది. అట్టి ప్రేమ తల్లి వద్దనే లభిస్తుంది. అందుకే తల్లి ఒడిలో కూర్చోడానికి బిడ్డ ఆరాటపడుతుంది. తల్లి ఒడి పసిపాపకు ఆనందడోలికగా అనిపిస్తుంది.

కేవలం ఆనందమేకాదు జ్ఞానం గూడ తల్లి నుండియే లభిస్తుంది. గృహమే మొదటి పాఠశాల, తల్లియే మొదటి గురువు. అది ఏమిటి, ఇది ఏమిటి, అని బిడ్డ తల్లిని అడిగి ప్రపంచాన్ని అర్థం చేసుకుంటుంది.

తల్లి ఒడి ఒక బడి మాత్రమేకాదు. అది గుడి గూడాను. దేవాలయంలో ఎంతటి పవిత్రత వుంటుందో, దేవుని కృప కొరకు మానవుడు ఎంతగా ఆవేదన చెందుతాడో అలాగే తల్లి సమక్షంలో ప్రశాంతి పొందుతాడు. తల్లి యొక్క అనురాగం కొరకు తపిస్తాడు.

## 2. కార్యశీలత

**ఇపుడు చిన్నపనులు చక్కగా నిర్వర్తిస్తే, మున్ముందు పెద్ద పనులు చేయవలసిందిగా కోరుతూ వాటంతటవే వస్తాయి.** [1]

ఇది పారసీక భాషలోని సామెత. సాధారణంగా మనుష్యుడు చిన్న పనులను చేయడంలో అశ్రద్ధ చూపుతాడు. వాటిని సరిగా చేయడు. నా అంతటి పెద్దవాడు ఇంత చిన్న పనులు చేయడమా అని విర్రవీగుతాడు. చాలా మందికి చిన్నపనులు చేయడమంటే నామోషి. తన గది తాను చిమ్ముకొనడంలోను, బావిలో నీళ్ళు తోడడంలోనూ, ఇంట్లో కూరగాయలు తోరగడంలోను, అన్నం తిన్న కంచం కడుగుకొనడంలోను నామోషిపడతారు. ఇవన్నీ వారికి ఎవరో చేసిపెట్టాలి.

కాని, చిన్నపనులను గూడ శ్రద్ధగా చేస్తూ వుంటే ఆ వ్యక్తి పనిమంతుడవుతాడు, పనిలో నైపుణ్యం ఏర్పడుతుంది. అపుడు పెద్ద పనులు తమంతట తామువచ్చి చేయమని కోరుతాయట. అంతేగదా! ఒక వంటవాడు చిన్నస్థాయిలో

---

1 Do well little things now; so shall great things come to thee by and by asking to be done.

—Persian Proverb

పదిమందికీ పాతికమందికీ శ్రద్ధగా రుచికరంగా వంటలు చేసి నట్లయితే ఇతని వంట రుచిచూచిన వారు పెళ్ళిళ్ళకూ సమారాధనలకూ పిలిచి వంటలు చేయించుకుంటారు. చిన్న పని శ్రద్ధగా చేసినట్లయితే పెద్ద పనులు చేయమని కోరుతూ అవే వస్తాయి.

## 3. విద్య

**విద్య లేకుంటెను విభవమ్ము రోత**
**వినయమ్ము లేకుంటె విద్యలూ రోత.**

ఇది జానపదులు పాడుకొనేపాట. ఇందులో విద్య యొక్క విలువ ఎట్టిదో చక్కగా సరళంగా చెప్పినారు.

'విభవము' అనగా సంపద. 'రోత' అనగా హీన మైనది, అసహ్యకరమైనది అని అర్థము.

ధనవంతునికి చదువురానట్లయితే అతని సంపద యావత్తూ అసహ్యంగా పరిణమిస్తుంది. అది రాణించదు. సద్వినియోగపడదు. పనికిరాకుండా వ్యర్థమవుతూ వుంటుంది.

అలాగే విద్యగలవానికి వినయం లేనట్లయితే అతనికి గల విజ్ఞానము చెడ్డ ఫలితాల నిస్తుంది. అతడు తన విద్యతో ఇతరులకు ప్రమాదం కలిగిస్తాడు. అపకారానికే విద్యను విని యోగిస్తాడు. కనుక విద్యావంతుడు వినయాన్ని అలవరచు కోవాలి.

## 4. స్నేహము

స్నేహము దుఃఖమును భాగిస్తుంది; ఆనందమును హెచ్చిస్తుంది. [2]

ఇదియొక ఆంగ్ల సామెత. ఈ సామెతలో స్నేహము వలన కలిగే ప్రయోజనం చక్కగా వర్ణించబడినది.

ఒక బాలునికి జ్వరం వచ్చింది. తీవ్రముగా తలనొప్పి వున్నది. మంచంమీద పడుకొని మూలుగుచున్నాడు. ఇంతలో అతనిని చూడడం కొరకు ఆప్తమిత్రు లిద్దరు వచ్చారు. వారు ఇతనికి ప్రియమైన మాటలు చెప్పారు. తలనొప్పి మందు తెచ్చియిచ్చారు, బడిలో సంగతులు మాట్లాడారు. అతని బాధ తగ్గినట్లనిపించింది. జ్వరం తగ్గి పోతుందని ధైర్యం కలిగింది. కనుక స్నేహము దుఃఖాన్ని భాగిస్తుంది.

ఒక విద్యార్థి ప్రథమశ్రేణిలో పరీక్ష ప్యాసయినాడు. తల్లిదండ్రులు సంతోషపడ్డారు. కొడుకుమీది ప్రేమతో తల్లి ఆనాడు అతని కిష్టమని బజ్జీలు, జిలేబి చేసి పళ్ళెంలో తెచ్చిపెట్టింది. తానొక్కడే తింటే అందులో ఆనందం లేదు. స్నేహితులను పిలిచి వారందరికీ పిండివంటలు పెట్టించి

[2] Friendship multiplies joys and divides grifs.

—English Proverb

వారితో పాటు తాను తిన్నాడు. అప్పుడతని ఆనందం అధిక మయింది. స్నేహం ఆనందాన్ని హెచ్చివేస్తుంది. కనుక స్నేహం వలన కలిగే సంతోషానికి విలువగట్టలేము.

# 5. దేశభక్తి

## జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి

శ్రీరాముడు రావణుని సంహరించి లంకాపురమును జయించాడు. లంక సుందరముగా నిర్మింపబడిన భవనములతో సువర్ణముతో చేయబడిన లతలతో తీగెలతో అలంకరింపబడి కడు రమణీయముగా నున్నది. అట్టి లంకానగరము స్వాధీనముకాగానే లక్ష్మణుడు "అన్నా! ఈ మహానగరము మిగులసుందరముగ నున్నది. ఇది మనవశమైనది. కనుక దీనిని పరిపాలిస్తూ ఇచటనే వుండిపోదాం" అన్నాడు.

అందుకు శ్రీరాముడు "సోదరా! సువర్ణమయమైన ఈ లంకానగరము నన్ను ఆకర్షించుటలేదు. నాకు జనని, జన్మభూమి స్వర్గముకంటె ప్రియమైనవి" అని అన్నాడు. ఈ వాక్యములో శ్రీరాముడు తనకుగల మాతృ భక్తిని, దేశభక్తిని వెల్లడించాడు. ఆయన చెప్పిన సూక్తియే మనందరికీ ఆదర్శంగా నిలుస్తుంది. స్వర్గం కంటెగూడ మాతృభూమి ప్రియమైనదిగా మనము భావన చేయాలి,

## 6. జీవనసూత్రము

**సూది వోలె బ్రదుక రాదు, దారమునట్లు**
**మనుట నేర్వవలయు మానవుండు**
**సూది తూట్లు వేయుచుం బోవు, దార మా**
**రంధ్రములను గప్పి రాణ చెందు.**

ఈ పద్యములో మానవుడెట్లు జీవింపవలయునో చక్కగా చెప్పబడినది. దీనిని తుమ్మల సీతారామమూర్తి గారు రచించారు.

మల్లెపూలతో మాలకట్టవలెనన్నచో మొదట సూదిలో దారం గుచ్చుతాము. ఆ సూదితో ఒక్కొక్క మల్లెపూవునే గుచ్చుతాము. దారముతో ఆ పూలన్నీ ఒక మాలగా కలిపి వుంచుతాము.

ఇచట సూది పూలను గుచ్చుతూ రంధ్రాలుచేస్తూ వుంటుంది. అందుమూలమున పుష్పములకు ఎంతటి బాధ కలుగునోగదా. మానవుడు ఆ సూదివలె బ్రతుకరాదు.

దారము ఆ రంధ్రములను పూరిస్తూపోతుంది. అంతేగాక పుష్పములను సమైక్యంగా కలిపి ఉంచుతుంది. కనుక మానవుడు ఆ దారమువలె జీవించాలి.

## 7. మాటలు

**మాట్లాట నేరిస్తే పోట్లాట వుండదు.**

కలహాము లన్నియు మొదట కటువైన మాటల వలననే ఆరంభమవుతాాయి. ఒకరితో నొకరు మాట్లాడు నపుడు మృదువుగా, మర్యాదగా, సగౌరవముగా, ప్రేమతో మాట్లాడవలయును అట్లుగాక అమర్యాదగా, హేళనగా, కటువుగా, కఠినముగా మాట్లాడినచో వారినడుమ రవరవలు, రుసరుసలు ఆరంభమై తుదకు శత్రుత్వమునకు దారితీయును.

అందుచేత 'మాట్లాట నేరిస్తే పోట్లాట ఉండదు' అనే సామెత ఏర్పడినది. ఇది ఎల్లరకు మార్గదర్శకంగా వుండే చక్కని సామెత.

## 8. బలము

**బలమే జీవనము, బలహీనతే మరణము** [3]

ఇది స్వామి వివేకానందుడు చెప్పిన సూక్తి. ఒక్క వాక్యంలో గొప్ప హితమును బోధించినాడు.

బలములేని వ్యక్తి జీవితము దుర్భరముగా వుంటుంది. ఎప్పుడూ ఏదో జబ్బుతో బాధపడుతుంటాడు. ఒక వ్యాధి

---

[3] "Strength is life and weakness is death"
—Swami Vivekananda

నయమైతే మరొక వ్యాధి వస్తుంది. ఎల్లపుడు డాక్టర్ల చుట్టూ తిరుగుతుంటాడు. అంతేగాక అనారోగ్యం వలన, బలహీనత వలన ఏ మంచి పనిని చేయలేడు. తనకంటె బలవంతుడు తనతో కలహిస్తే అతనిని ఎదుర్కొనలేడు. రౌడీల నుండి, దుర్మార్గులనుండి తనను తాను రక్షించుకొనలేడు. దుష్టులకు లొంగిపోతాడేగాని ఆత్మరక్షణ చేసుకొనలేడు.

బలముగలవాడు ఆరోగ్యంగా వుంటాడు. అతనికి శరీరము, మనస్సు సక్రమంగా పనిచేస్తాయి. శారీరక శ్రమను ఎదుర్కొనగలడు. ఎంతటి పనినైనా చేయుటకు సిద్ధంగా వుంటాడు. బలము నుపయోగించి ఆత్మరక్షణ చేసుకొన గలుగుతాడు.

శారీరకంగా శక్తి కలిగియుండుటేగాక ఐకమత్యము ద్వారా కూడా బలమును పొందించుకొన వలసి యున్నది. స్నేహితులతో, బంధువులతో, కుటుంబ సభ్యులతో కలిసి మెలసి యుండుట వలన వ్యక్తికి అండదండలు లభిస్తాయి. అవసరమైనపుడు తన మిత్రులు, బంధువులు, సోదరులు ఆర్థికంగాను ఇతర విధాలుగాను సహాయపడతారు. అండగా నిలుస్తారు. కనుక మనుష్యునికి ఈ రెండు రకములైన బలము అత్యవసరము.

అందుకే స్వామి వివేకానందుడు బలహీనత మరణముతో సమానమని, బలము కలిగియున్నవాడే సుఖముగా జీవించగలడనీ బోధించినాడు.

# 9. ప్రేమ

**ప్రేమ కత్తిలేకుండా పరిపాలిస్తుంది, చట్టము లేకుండా శాసిస్తుంది.**

ప్రేమ చాలా శక్తివంతమైనది. ప్రేమ వున్నచోట ఎక్కువ తక్కువ లుండవు. ప్రేమతో అవతలివాని హృదయాన్ని జయించవచ్చు. ఆ తర్వాత అతనిచేత ఎట్టి కష్టమైన పనిగూడ చేయించవచ్చు. ప్రేమ కొరకు మానవుడు సర్వస్వాన్నీ త్యాగం చేస్తాడు.

అందుచేత ప్రేమతో ఎదుటివారిని ఎటువంటి ఆయుధం ప్రయోగించకుండా పరిపాలించవచ్చు. వేరే చట్టముతో అవసరంలేకుండ ప్రేమతో శాసించవచ్చు. ఈ సూక్తిని శ్రీ సత్యసాయి బాబాగారు చెప్పారు.

ప్రేమతో ఎంతటివారినైనా లొంగదీసుకొనవచ్చు, తనకు అనుకూలంగా చేసుకొనవచ్చు. ప్రేమకు గల శక్తి అట్టిది.

# 10. విద్యార్జన

**బోధన బడితో ఆఖరు; విద్యార్జన జీవితంతోనే ఆఖరు**

విద్యను గురించి, విద్యార్థి గురించి తెలిపే చక్కని సూక్తి యిది.

బడిలో ఉపాధ్యాయుడు పాఠాలు చెపుతాడు. విద్యార్థి పాఠాలు చదివి జ్ఞానం గ్రహిస్తాడు. ఈ విధంగా 15 లేక 17 సంవత్సరాలపాటు విద్యార్థి విద్యాలయాలలోను కళాశాలల్లోను జ్ఞానాన్ని పొందుతాడు. ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించడం బడితో ఆఖరవుతుంది.

కాని అంతటితో విద్యార్థి విద్యను గ్రహించడం ఆపడు. గ్రంథాలు చదివి, అనుభవాలు పొంది, విద్యార్థి జీవితాంతం క్రొత్త విషయాలు నేర్చుకుంటూనే వుంటాడు. మరణించే వరకు అతడు విద్యను గ్రహిస్తూనే వుంటాడు. విద్యార్జన నిరంతరం కొనసాగుతూనే వుంటుంది. అది జీవితంతోనే ఆఖరవుతుంది.

అందుచేత నిజమైన విద్యార్థి నిరంతరం జ్ఞానార్జన చేస్తూ వుంటాడు.

## 11. తల్లిదండ్రులు-1

### తల్లి దైవము; తండ్రి ధనము.

తల్లిదండ్రు లిరువురూ బిడ్డ పురోభివృద్ధికి రెండు విధాలుగా తోడ్పడుతారు.

తల్లి బిడ్డకు ప్రేమ నిస్తుంది. బిడ్డ తప్పుచేసినా క్షమిస్తుంది. బిడ్డ అనాకారిగావున్నా అతనిపై ప్రేమతో ముద్దులు

కురిపిస్తుంది. వాత్సల్యంతో దగ్గరకు తీస్తుంది. ప్రేమయే దైవము. అందుచేత తల్లి దైవముతో సమానమైనది.

తండ్రి డబ్బును సంపాదించి బిడ్డలకు చదువు చెప్పిస్తాడు. గుడ్డలు కొనిపెడతాడు. అవసరమైనపుడు డబ్బులిచ్చి ఆదుకుంటాడు. ఆఖరుకు తన ఆస్తినిగూడ బిడ్డలకు సంక్రమింప చేస్తాడు. కనుక తండ్రి ధనము లాంటివాడు.

ప్రేమ, ధనములను అందించి తమ పురోభివృద్ధికై కృషి చేయు తల్లిదండ్రుల యెడ బిడ్డలుగూడ అనురాగముతో నడచుకోవాలి.

## 12. అనుభవం

**అనుభవం జ్ఞానానికి జనకుడు.** [4]

మనం విద్యాలయాలలో ఎన్నో శాస్త్రాలు చదువుచున్నాము. ఈ విజ్ఞానమంతా ఎచటి నుండి వచ్చింది? అనుభవాల నుండి వచ్చింది.

మనకంటె పూర్వము కొన్ని వేల సంవత్సరాల నుండి భూమిమీద ప్రజలు నివసిస్తున్నారు. వారు ఆర్థికముగా, రాజకీయముగా, సామాజికముగా అనేక అనుభవములను పొందారు. వాటి నుండి కొన్ని గుణపాఠములను గ్రహిం

---

[4] Experience in the father of knowledge.

చారు. ఆ గుణపాఠములే చరిత్ర, ఆర్థిక శాస్త్రము, పౌర శాస్త్రము మున్నగు సాంఘిక శాస్త్రములుగా మనము పఠించుచున్నాము.

విజ్ఞాన శాస్త్రవేత్తలు ప్రకృతిలో సంభవించెడి అనేక మార్పులను, రసాయనిక ప్రక్రియలను పరిశీలించారు. తద్వారా కొన్ని అనుభవములను పొందారు. వాటిని సూత్రీకరించుట ద్వారా విజ్ఞాన శాస్త్రములను రచించారు.

మనముగూడ జీవితములో అనేక అనుభవాలను పొందుతాము. వాటి నుండి మనము గ్రహించు గుణపాఠములు, హెచ్చరికలు, జ్ఞానముగా రూపొంది మన జీవితమునకు మార్గదర్శకముగా వుంటుంది. అందుకే 'అనుభవం జ్ఞానానికి జనకుడు' అని అన్నారు.

## 13. ఎరుక

### ఎరుక పిడికెడు ధనం

ఎరుక అనగా ఎరిగి యుండుట.ఎవరినిఎరిగి యుండుట? మనుష్యులను ఎరిగియుండుట,తనలాంటివారినిఎరిగియుండుట. అనగా పలువురు వ్యక్తులతో పరిచయముచేసుకొని, వారితో స్నేహము చేసుకొని వారిని ఎరిగియుండుట.

చాలామంది తమ బతుకు తాము బతుకుతారు. ఇతరులతో మాట్లాడరు. క్రొత్తవారిని పరిచయం చేసు

కొనరు. అలా ఏకాకిగా వుండుట మంచిది కాదు. ఇతరులతో కలిసి మెలగాలి.

అట్లు ఇతరులను ఎరిగివున్నట్లయితే ఆ ఎరుక పిడికెడు ధనముతో సమానమవుతుంది. అది డబ్బుకంటెగూడ విలువైనది. ఏదైన సుస్తి చేసినపుడు డాక్టరు వద్దకు పోవాలన్నా, ఒక ఖరీదైన వస్తువును బజారులో కొనవలెనన్నా, తనకు తెలియని పాఠాలను ఎవరినైనా అడిగి చెప్పించుకోవలెనన్నా, తాను ఎరిగున్నవారు చాల అవసరము. అందుకే ఎరుక పిడికెడు ధనమని పెద్దలు చెప్పారు.

అందుచేత ప్రతివ్యక్తీ నిరంతరము క్రొత్తవారిని పరిచయం చేసుకోవాలి. పరిచయమైనవారిని మరచిపోకుండ గుర్తుంచుకోవాలి.

## 14. నోరు

**నోరు మంచిదవుతే ఊరు మంచిదవుతుంది.**

ఒకడు క్రొత్తగా ఒక ఊరు వెళ్ళాడు. అచటికి వెళ్ళి వ్యాపారం చేసుకొని బ్రతుకుదామనుకున్నాడు. అతడు ఎవరినీ ఎరుగడు. అదే మొదటిసారిగా అచటికి వెళ్ళడం.

అతడచటికి వెళ్ళబోయేముందు ఫలానావూరు మంచిదేనా అని ఎవరినో అడిగాడు. అందుకతడు "నోరు మంచిదవుతే వూరు మంచిదవుతుంది" అన్నాడు.

ఒక వూరులోని జనులు వారంతటవారు మంచివారూ కారు, చెడ్డవారూ కారు. వారితో మాట్లాడే వ్యక్తిని బట్టి అవతలివాళ్ళ మంచితనం వుంటుంది. మాటలే మంచినిగాని చెడునుగాని సృష్టిస్తాయి. కనుక జాగరూకతతో మృదువుగా మధురంగా మాట్లాడాలి. మన మాటలను బట్టే ఎదుటివారు అనుకూలురో వ్యతిరేకులో అవుతారు.

## 15. ఆరోగ్య సూత్రం

**ఘనపదార్థాలను త్రాగాలి, ద్రవపదార్థాలను నమలాలి** [5]

ఇది ఒక ఆరోగ్య సూత్రము. దీని ప్రకారం రొట్టె జామపండు, లడ్డు, బిస్కట్లు వగైరా ఘనపదార్థాలను త్రాగాలి. పాలు, మజ్జిగ, కాఫీ వగైరా ద్రవపదార్థాలను నమలాలి.

ఘనపదార్థాలను ఎలా త్రాగుతారు? ఇది విడ్డూరంగా లేదా? రొట్టెను త్రాగడం ఏలవుతుంది?

దీని అర్థం వేరే వున్నది. మన నోట్లో లాలా జలమున్నది. ఏ ఆహారమైనా జీర్ణం కావడానికి లాలాజలం అత్యవసరం. రొట్టెను త్రాగడానికి వీలుగా అది ద్రవపదార్థంగా మార్పు చెందేటంతగా దాన్ని అనేకసార్లు నమలాలి.

---

5 Drink the solids and eat the liquids.

నమలినపుడు లాలాజలం దానితో కలిసి త్రాగడానికి వీలుగా తయారవుతుంది. అపుడు దాన్ని మ్రింగితే చక్కగా జీర్ణమవుతుంది.

మరి, ద్రవపదార్థాలను నమలడమంటే ఏమిటి ?

ద్రవపదార్థాలుకూడ నేరుగా త్రాగినట్లయితే జీర్ణము కావు. అవి జీర్ణం కావడానికి కూడ లాలాజలమవసరము. అందుచేత పాలుగాని, మజ్జిగగాని, కాఫీగాని, మంచినీరుగాని త్రాగేటపుడు కొలది క్షణాలు బుగ్గల వద్ద నిలిపి వుంచి దంతములను కదిలిస్తూ నమలినట్లుగా చేసి ఆ తర్వాత మ్రింగాలి. అంతేగాని గడగడా త్రాగకూడదు.

# 16. పని

**నీవు ప్రేమించిన పని నీకు లభ్యంకాకపోతే, లభించిన పనిని ప్రేమించు.** [6]

చేసేపనిమీద ఇష్టములేనిచో ఆ పనిని బాగా చేయలేము. ఇష్టమున్నచో ఆ పనిమీద శ్రద్ధ ఏర్పడుతుంది. అపుడు దానిని ఎంతో నైపుణ్యముగా చేస్తాము.

బడిలో చదువుకున్నా, వ్యవసాయం చేసినా, వ్యాపారం చేసినా, ఉద్యోగం చేసినా, వైద్యంచేసినా, కారు నడిపినా, పడవనడిపినా, ఏ పని చేస్తున్నప్పటికీ దానిపై ప్రేమ కలిగి ఉండాలి. అపుడు మాత్రమే దానిని విజయ

---

[6] If you do not get the work you love, love the work you get. [1]

వంతముగా చేయగలము. లేనిచో ఆ పని విఫల మవుతుంది. అపజయము ఎదురవుతుంది.

కొందరికి తాము ఏ పనిమీద ఇష్టమున్నదో ఆ పని లభిస్తుంది. దానినపుడు సంతోషంగా నైపుణ్యంతో చేయ గలుగుతారు. అందులో విజయం సాధిస్తారు.

కాని ఒక్కొక్కసారి తన కిష్టముకాని వృత్తి చేపట్ట వలసి వస్తుంది. గత్యంతరము లేదు. అతడా ఉద్యోగము చేయక తప్పదు. అలాంటపుడు లభించిన పనిని ప్రేమించడం నేర్చుకోవాలి. ఆ పనిమీద ప్రేమ ఏర్పరచుకొని విజయ వంతముగా దానిని నిర్వహించాలి. ఈ సత్యమును తెలుపు సూక్తియిది. నీకు నచ్చిన పని నీకు లభ్యం కానట్లయితే లభించిన పనిని నచ్చేటట్లు చేసుకోవాలి.

## 17. ప్రయత్నము

**సాధనమున పనులు సమకూరు ధరలోన**

ఇది వేమనయోగి చెప్పినసూక్తి.

ప్రయత్నము వలననే పనులు జరుగుతాయి. ఏ పనీ చేయకుండా సోమరిగా కూర్చుంటే కోరిన ఫలితములు లభిం చవు. మృగరాజైన సింహము కూడ గుహలో నోరు తెరచు కొని కూర్చుంటే జంతువులు వచ్చి దాని నోట్లోపడవు. ఆఖ రుకు ఒక ఈగగూడ దానికి ఆహారంగా లభించదు.

చీమ చాల చిన్న ప్రాణి. అది ప్రాకుచూ ప్రాకుచూ కొన్ని మైళ్ళదూరము పోతుంది. తన ఆహారం తాను సంపాదించుకుంటుంది. వర్షాకాలంలో భుజించడం కొరకు ముందుగానే బియ్యపుగింజలను తెచ్చి దాచుకుంటుంది. ఇలా ప్రయత్నము ద్వారా పనులు సాధించుకొనగలుగు తున్నది. ఎట్టి కృషి చేయనివాడు బండరాయినలె కదలక మెదలక ఉండిపోవునే గాని సత్ఫలితములను పొందజాలడు.

## 18. గుణములు

**తన కోపమె తన శత్రువు**
**తన శాంతమె తనకురక్ష దయ చుట్టంబౌ**
**తన సంతోషమె స్వర్గము**
**తన దుఃఖమె నరక మండ్రు తథ్యము సుమతీ.**

మానవునికి అపకారముగాని ఉపకారముగాని ఇతరులెవరో చేయరు. అతని గుణములే అతనికి కీడుగాని మేలుగాని చేస్తాయి.

అతని కోపము వలననే శత్రువులు ఏర్పడుతారు. అతనికి గల శాంతమే అతనిని కాపాడుతూ వుంటుంది. అతడు ఇతరులఎడ చూపు దయాగుణము చుట్టమువలె సహాయపడుతుంది. స్వర్గ మెక్కడో లేదు. అతని సంతోషమే స్వర్గంగా అనిపిస్తుంది. అతనికి కలిగెడి దుఃఖమే నరకప్రాయంగా వుంటుంది.

## 19. మంచిమాట

**మంచిమాటకు ఖర్చులేదు, విలువ అధికం.**

ఎవరికైనా కష్టం వచ్చినా, బాధ కలిగినా అతనిఎడల సానుభూతి చూపాలి. వెళ్ళి పలకరించాలి. ధైర్యం చెప్పాలి. మంచిమాట మాట్లాడాలి. అలా మంచిమాట చెపితే దానికి డబ్బు ఖర్చులేదు. పైగా దాని విలువ అధికం. బాధలో వున్న వ్యక్తి ఇతని మాటల వలన ఉత్సాహం పొందుతాడు. నిరాశను వదలివేస్తాడు. ఇతనిని తన ఆప్త మిత్రునిగా పరిగణిస్తాడు. అందుచేత మంచి మాటకు ఖర్చు లేకపోగా దాని విలువ చాల ఎక్కువ.

## 20. తల్లిదండ్రులు-2

**తన తండ్రినైనను తల్లి నైనను దూషించువాని**
**దీపము కారుచీకటిలో ఆరిపోవును.**

ఇది బైబిలులోని వాక్యము. బిడ్డకు జన్మనిచ్చేవారు తల్లిదండ్రులు. వారతనిని పెంచి పెద్దను చేస్తారు. విద్య చెప్పిస్తారు. అతని అభివృద్ధికై ఎంతో పాటుపడుతారు. ఎంతో డబ్బు వెచ్చించి కావలసినవన్నీ కొనిపెడతారు. తాము తినకుండ గూడ బిడ్డల కొరకు అన్నిటినీ సమకూరుస్తారు.

అట్టి తల్లిదండ్రుల యెడ కుమారుడు కృతజ్ఞత చూపాలి. వారిని వృద్ధాప్యంలో ఆదుకోవాలి. అలా చేయక పోగా తల్లినిగాని తండ్రినిగాని దూషించడం మహాపాపము. అట్లు దూషించువాని దీపము కారుచీకట్లో ఆరిపోతుంది. అనగా ఏమిచేయవలెనో తెలియక, కాళ్ళు చేతులాడక ఇబ్బందులపాలవుతాడు. జీవితం అంధకారబంధుర మవు తుంది.

# 21. అయిష్టం

**ఏడుస్తూ వ్యవసాయం చేస్తే కాడీ మోకులూ దొంగ లెత్తు కెళ్ళారట.**

ఇది ఒక తెలుగు సామెత.

ఒకడికి వ్యవసాయం చేయడం ఇష్టం లేదు. బల వంతంగా వాడి కాపని వప్పగించారు. అతను అయిష్టంగా వ్యవసాయంలోకి దిగాడు. ఏదీ అతనికి చేతకాదు. నాట్లు వేయడం, పొలాలకు నీరు పట్టడం, కోతలకాలంలో కోతలు కోయడం అన్నీ నిర్లక్ష్యంగా చేస్తున్నాడు. వీడి సోమరితనా నికి తగినట్లుగా ఎద్దులకువేసే కాడీ, బండికికట్టే మోకులూ దొంగ లెత్తుకెళ్ళారు. అతనికి చాలా నష్టం జరిగింది.

ఇష్టం లేకుండా చేసే పనులు ఇలాగే విఫలమవు తాయి. చదువుకోవడం గాని, వ్యవసాయం చేయడంగాని,

తీర్థయాత్రలు చేయడంగాని, చెట్లను పెంచడంగాని, ఏపని నైనా ప్రీతితో చేయాలి. లేనిచో అవి సరిగా జరగవు.

## 22. స్వాతంత్ర్యము

**బానిసకు బాధలెక్కువ, స్వతంత్రుడికి బాధ్యత లెక్కువ.**

జిల్లెళ్ళమూడి 'అమ్మ' అని పిలువబడే మాతృశ్రీ అనసూయాదేవి ఈ వాక్యం చెప్పారు.

ఇదివరలో ప్రపంచంలో చాలా దేశాలలో బానిస వ్యాపారం జరుగుతుండేది. ఆఫ్రికా ఖండంలోని నీగ్రోలను అమెరికాకు నౌకలలో తీసుకుపోయి బానిసలుగా అమ్మే వారు. మధ్య ఆసియాలోని ముస్లిం దేశాలలో గూడ బానిస లను సంతకు తీసుకొనివచ్చి జంతువులను అమ్మినట్లు అమ్మే వారు. అట్లా కొనబడిన వ్యక్తులను ధనవంతులు తమ ఇళ్ళలో చాకిరి చేయడానికి వినియోగించేవారు. బానిసలకు బ్రతక డానికి సరిపడే తిండిమాత్రం పెట్టేవారు. వారికి ఎట్టి స్వేచ్ఛ వుండేదికాదు. జంతువులవలె బళ్ళు లాగడం, బరువులు మోయడం, పొలం దున్నడం లాంటి పనులకు బానిసలను వినియోగించేవారు.

ఒక విదేశ ఆధిపత్యం క్రింద వున్న ప్రజలుగూడ బానిసత్వం అనుభవించవలసి వచ్చేది. ఆ దేశం యొక్క

సంపదయావత్తూ పరాయి పాలకులు తమ దేశానికి తరలించుకు పోతారు. ఆ దేశ ప్రజలు దారిద్ర్యంలో మగ్గిపోతారు. మన దేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో వుండగా మన ప్రజలు అలాంటి దారుణ పరిస్థితులను అనుభవించారు. దేశం కరువుకాటకాలలోను, నిరుద్యోగంతోను బాధలకు లోనయింది.

స్వతంత్రుడికి బాధ్యత లెక్కువ. స్వశక్తితో అతడు వృద్ధిలోకి రావాలి. స్వయం కృషితో పురోగతి సాధించాలి. ఆత్మరక్షణ చేసుకోవాలి. అదే విధంగా స్వతంత్రం పొందిన దేశ ప్రజలుగూడ ఎన్నో బాధ్యతలను నిర్వర్తించాలి. ప్రజలందరినీ విద్యావంతులుగ చేయాలి. దేశ రక్షణ చేసుకోవాలి. వస్తూత్పత్తి అధికంగా చేసుకొని ప్రజల అవసరాలు తీర్చగలగాలి. క్రమశిక్షణతో మెలగి ప్రభుత్వం చేపట్టే పథకాలను విజయవంత మొనరించాలి.

ఇలా వ్యక్తిగాని దేశంగాని స్వశక్తిపై నిలబడాలి. అందుకే "బానిసకు బాధలెక్కువ, స్వతంత్రుడికి బాధ్యత లెక్కువ" అని చెప్పారు.

## 23. కోపము

**కోపమునకు ఘనత కొంచెమై పోవును**

ఇది వేమన యోగి చెప్పినసూక్తి.

ఎంతగొప్పవాడైనా, ఎంత విద్యావంతుడైనా, ఎంతటి పండితుడైనా కోపం తెచ్చుకున్నట్లయితే అతని ఘనత తగ్గి

పోతుంది. ఇతరులు అతనిని గౌరవించడం మానివేస్తారు. కోపిష్టిని ఎవరూ అభిమానించరు.

కోపము వలన వ్యక్తి స్నేహితులను కోల్పోతాడు. గౌరవం కోల్పోతాడు. వీలైనంతవరకు కోపమును దరిజేరనివ్వరాదు. అవతల వ్యక్తి కటువుగా మాట్లాడినపుడు ఉద్రేక పడకుండా కోపం తెచ్చుకోకుండా నింపాదిగా అతనికి ఉన్న పరిస్థితిని వివరించి తన అభిప్రాయాన్ని ఆమోదించునట్లు చేసుకోవాలి. తొందరపడి కోపమునకు తావివ్వరాదు.

## 24. పరనింద

**ఒక్కవ్రేలు జూపి ఒరులను నిందింప**
**వెక్కిరించు నిన్ను మూడు వ్రేళ్ళు**

ఇది 'బాలరాజు కథ' అనే సినిమాలో చెప్పబడిన మంచిమాట.

ఇతరులను నిందించగూడదు. ఎందువల్లనంటే ఇతరులలో వున్న లోపాల వంటి లోపాలు నీలోగూడ వుంటాయి. నీలోని దోషాలను గ్రహించి సరిదిద్దుకొనుటకు ప్రయత్నించు. అంతేగాని పరులను నిందిస్తూ కాలంగడపకు.

నీవు పిడికిలి ముడిచి చూపుడువ్రేలుతో ఇతరులను నిందిస్తూ వుంటావు. అపుడు మిగతా మూడు వ్రేళ్ళూ నీవంకకు తిరిగి నిన్ను వెక్కిరిస్తుంటాయి. కనుక పరనింద చేయకు.

## 25. ఉత్తముడు

**ఉత్తముడు మాటల్లో మూగిగాను, చేతల్లో చురుకుగాను వుంటాడు.**

క్రీస్తు పూర్వము 6వ శతాబ్దములో చైనా దేశంలో కన్‌ఫ్యూషియస్ అను గొప్ప తత్త్వవేత్త ఉండేవాడు. ఆయన చెప్పిన వాక్యమిది.

ఇందు ఉత్తముడైన వ్యక్తి ఎలా ఉంటాడో చెప్ప బడినది. అతడు వదరుబోతువలె లొడలొడా మాట్లాడడు. మాటల్లో మూగవానివలె వుంటాడు. అంటే అవసరమైనంత వరకే, చాల తక్కువగా మాట్లాడుతాడు. పనులు చేయ డంలో చాల చురుకుగా వుంటాడు. నైపుణ్యంతో తన పనులు తాను చేసుకుంటూ పోతాడు.

## 26. అతి

**అతి సర్వత్ర వర్జయేత్**

ఇది యొక సంస్కృత సూక్తి.

మానవుడు ఏ పనినీ అతిగా చేయకూడదు. దేనినైనా సరే పరిమితంగా చేయాలి.

కొందరు అతిగా భుజిస్తారు. హోటలుకు వెళితే డజను ఇడ్లీ, అరడజను పూరీ, నాలుగు మసాలా దోసెలూ ఒక్కడే

పుచ్చుకుంటాము. ఇదేమీ మంచి అలవాటు కాదు. జీర్ణకోశం సరిగా పనిచేయక త్వరలో వ్యాధిగ్రస్తుడవుతాడు. మరికొందరు అతిగా నిద్రపోతారు. భోజనసమయంలో మినహా మిగతా కాలమంతా పక్కమీదనే పడుకొని వుంటారు. పిచ్చినిద్ర పోతుంటారు.

ఇంకా కొందరు అదే పనిగా ఆటలాడుతుంటారు. పగలల్లా క్రికెట్ బ్యాట్ పుచ్చుకొని ఆట స్థలంలో ఆడుతూ వుంటారు.

ఇలా ఏపనీ అతిగా చేయగూడదు. చదవడంగూడ అతిగా చదవగూడదు. మధ్యలో మనస్సుకు విరామం ఇస్తూ వుండాలి. పనులలో మార్పే విశ్రాంతి. కనుక రకరకాల పనులను చేస్తూ వుండాలి. అదే పనిగా ఏదో ఒక వ్యసనానికి లోనుకాగూడదు. అన్నిట్లోనూ 'అతి' అనేదాన్ని వర్జించాలి.

## 27. తలవిలువ

**తలవిలువ నోరు చెపుతుంది.**

తలలో మెదడున్నది. ఆ మెదడులో వ్యక్తి గ్రహించిన విజ్ఞానము, తెలివితేటలు, ప్రతిభ, అన్నీ దాచిపెట్టబడి వుంటాయి. జీవితంలో ఎన్ని మంచి విషయాలు నేర్చుకున్నాడో, అవన్నీ తలలో సమకూర్చబడి వుంటాయి.

ఐతే తలలో ఇంత విజ్ఞానం వున్నట్లు ఇతరులకు ఎలా

తెలుస్తుంది? నోటి ద్వారా తెలుస్తుంది. అతడు మాట్లాడే మాటలవలన అతడు అజ్ఞానియో విజ్ఞానియో పరులు గ్రహించ గలరు. కనుక అతడు వెల్లడించే మాటల ద్వారా అతని ప్రతిభ లోకానికి తెలుస్తుంది. అందుకే "తల విలువ నోరు చెపుతుంది" అనే సామెత ఏర్పడింది. మాటలు నేర్పుగా మాట్లాడాలి. వాటి ద్వారానే ఒక వ్యక్తి యొక్క విలువ వెల్లడవుతుంది.

## 28. వృక్షములు

**బ్రతికి నన్ని నాళ్ళు ఫలము లిచ్చుటె గాదు**
**చచ్చి గూడ చీల్చి యిచ్చు తనువు**
**త్యాగ భావమునకు తరువులే గురువులు**
**లలిత సుగుణజాల తెలుగు బాల.**

ఈ పద్యమును 'కరుణశ్రీ' జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు రచించారు. వృక్షములు లోకానికి చేయుచున్న సేవ ఎట్టిదో ఇందు చక్కగా వర్ణించారు.

వృక్షము జీవించియున్నంత కాలము జనులకు కాయలు, పండ్లు అందించి కడుపులు నింపుతున్నది. ఆకలి తీర్చుతున్నది. తరువాత ఏ గాలివానకో చెట్టుపడిపోయిన తరువాత గూడ జనులు తన శరీరాన్ని రంపాలతో కోసినప్పటికీ, చెక్కలుగా కట్టెపుల్లలుగా తన దేహాన్ని చీల్చి

యిస్తుంది. వాటిని జనులు గృహనిర్మాణానికి, వంట చెరకుగాను వాడుకుంటారు. ఇలా తాను ప్రాణం కోల్పోయి మరణించిన పిదపగూడ తన శరీరాన్ని ఇతరుల ఉపయోగానికై అందిస్తున్నది.

మనిషి చనిపోతే అతని శరీరం 24 గంటలలో కుళ్ళిపోయి పనికిరాకుండా పోతుంది. కాని చెట్టు తాను చనిపోయిన పిదపగూడ లోకానికి ఉపయోగపడుతుంది. త్యాగము అనే సుగుణాన్ని అలవరచుకొనుటకు వృక్షములే తగిన గురువులు!

## 29. సంసారం

**ఇష్టమున్న సంసారం అరవైమూడు, ఇష్టం లేని సంసారం ముప్పయిఆరు.**

ఇదియొక కుతూహలం కలిగించే తెలుగు సామెత. ఇందులో అన్యోన్యంగా ఆప్యాయంగా మెలిగే భార్యాభర్తలున్న సంసారం ఎలా వుంటుందో, పరస్పరం విరోధులవలె ప్రవర్తించే దంపతులు గల సంసారం ఎలా వుంటుందో తమాషాగా వర్ణింపబడినది.

అరవైమూడు అనే సంఖ్యను కాగితంమీద వేయండి. ఆ '63' వంక తదేక దృష్టితో చూడండి. 6, 3 ఎదురెదురుగా వున్నట్లు, అవి పరస్పరం చూచుకుంటున్నట్లు వుంటాయి. ఇష్టమున్న సంసారం ఇలా 63 వలె వుంటుంది.

ముప్పయి ఆరు సంఖ్యను గూడ కాగితం మీాద వేయండి. '36' వంక నిశితంగా చూడండి. 3, 6, అంకెలు వ్యతిరేక దిశలలో చూస్తున్నాయి. ఇష్టం లేని సంసారం ఇలా వుంటుంది. భార్యాభర్తలు ఎడమొగం పెడమొగం పెట్టుకొని వుంటారు.

ఉత్తములైన భార్యాభర్తలు '63' వలె వుండి అన్యోన్యంగా సంసారాన్ని నడుపుకోవాలని ఈ సామెత బోధిస్తున్నది.

## 30. స్త్రీ

**కలకంఠి కంట కన్నీ రొలికిన**
**సిరి యింట నుండ నొల్లదు సుమతీ**

కలకంఠి అనగా మధురమైన కంఠము గలిగినది. అనగా స్త్రీ. స్త్రీ కంటి నుండి కన్నీరు కారినట్లయితే ఆ గృహాములో సంపద నిలవదు. ధనము లేకుండా పోతుంది.

గృహాములో తల్లి, చెల్లెలు, భార్యా, కుమార్తెలు మున్నగువారుంటారు. వీరిలో ఎవరూ కన్నీరు కార్చరాదు. గృహస్థు అయినవాడు భార్య మనస్సుగాని, తల్లి మనస్సుగాని, ఇంట్లో వున్న ఏ మహిళ మనస్సుగూడ కష్టపెట్టగూడదు. ఆడపడచులకు గూడ బాధ కలిగించగూడదు. వీళ్ళలో ఎవరికంట నీరు వచ్చినా అట్టి గృహాములో సంపద్ద నిళవధు,

## 31. మద్యపానము

సింహము ఎదుటకు వెళ్ళినపుడు భయపడకు
అది నీ పరాక్రమమునకు గీటురాయి;
కరవాలమునకు నీ కుత్తుక నందించునపుడు భయపడకు
అది నీ బలిదానమునకు మచ్చుతునక
పర్వతాగ్రమునుండి క్రిందికి దుముకునపుడు భయపడకు
అది నీ తపమునకు సరియైన సాధన
అగ్నిజ్వాలలు నలుదెసల నలముకొనునపుడు భయపడకు
అది నీ సహనశక్తికి గట్టి పరీక్ష
కాని, మద్యమునకు మాత్రము తప్పక భయపడు
అది పాపములకు, అనాచారములకు కన్నతల్లి!

గౌతమ బుద్ధుడు ప్రజలకు అందించిన సందేశ మిది. ఒక విధంగా ఇది తీవ్రమైన హెచ్చరిక.

ఓ మానవుడా! సింహము ఎదుటకు పోవడానికి భయపడవద్దు. అది నీ పరాక్రమాన్ని సూచిస్తుంది.

ఏదైనా సమయం వచ్చినపుడు దేశరక్షణకొరకో, ప్రజాక్షేమముకొరకో, ఖడ్గమునకు నీ కంఠమును బలిచేయడానికి వెనుకాడకు, అది నీ త్యాగమునకు గుర్తు.

ఒక పర్వత శిఖరము నుండి క్రిందికి దూకుటకు భీతి చెందవద్దు. అది నీ తపస్సునకు సరియగు పరీక్ష.

నీ చుట్టూ అగ్ని జ్వాలలు అలముకొన్నప్పటికీ భయ పడకు. అది నీ సహనశక్తికి తార్కాణము.

కాని కల్లు, సారాయి, బ్రాందీ, విస్కీల వంటి మత్తుపదార్థములకు మాత్రము లోనుకావద్దు. వాటిని జూచి తప్పక భయపడు. ఎందువల్లనంటే, అవి మనుష్యుడు చేయు అన్ని పాపములకు, నేరములకు మూలకారణములు. అన్నిరకముల దురాచారములకు మద్యము కన్నతల్లి. మద్యమునకు దాసుడవు కావద్దు అని బుద్ధ భగవానుడు బోధించుచున్నాడు.

## 32. శ్రద్ధ

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం**

శ్రద్ధగలవానికే జ్ఞానము లభించును అని భగవద్గీతలో చెప్పబడినది.

చదువు రావాలంటే కేవలం పుస్తకాలుకొని యింట్లో పెట్టుకుంటే సరిపోదు. తల్లిదండ్రులు కొనుక్కోడానికి ప్రతి రోజూ డబ్బులిస్తూవుంటే చదువువచ్చి ఒళ్ళోపడదు.

'శ్రద్ధ' కావాలి. బడికి వెళ్ళడంలో శ్రద్ధ, పాఠాలు వినడంలో శ్రద్ధ, చదివిన వాటిని మననం చేసుకోవడంలో

శ్రద్ధ, పుస్తకాలను కాగితాలను కలాలను వినియోగించడంలో శ్రద్ధ- ఇలా నిరంతరం అన్నిటి ఎడల శ్రద్ధ కలిగియుండడం వలన విద్య లభిస్తుంది. చేసే పనిలో విజయం లభిస్తుంది.

శ్రద్ధయే జ్ఞానసముపార్జనకు కావలసిన ముఖ్యలక్షణం.

## 33. సంస్కారము

**రెండు అణాలు విలువచేసే ఇనుము సంస్కారములచే మూడువందల రూపాయల విలువ గల గడియారముగా మారును. కనుక సంస్కారమునకే విలువగాని పదార్థమునకు గాదు.**

ఈ వాక్యములు శ్రీ సత్యసాయిబాబాగారు చెప్పినవి. మనము చేతికి పెట్టుకొనే గడియారములోని యంత్రము ఇనుముతో చేయబడినది. ఆ ఇనుము ఖనిజముగా నున్నపుడు దాని వెల రెండు అణాలకంటె వుండదు. దానినే శుభ్రపరచి చినచిన్న సూదులుగను, రేకులుగను, నట్లుగను చేసి, సంస్కరించి, ఒక యంత్రముగా రూపొందించినపుడు ఆ గడియారము విలువ మూడువందల రూపాయలగుచున్నది. కనుక సంస్కారమునకే ప్రాముఖ్యముగాని పదార్థమునకు గాదు.

అట్లే ఒక సాధారణ మానవుడు నిరక్షరాశ్యుడుగా, అజ్ఞానిగా ఉన్నపుడు అతనికి విలువలేదు. అతడే విద్యను

గ్రహించి, విద్యతోబాటు ఉత్తమ సంస్కారములను, శిక్షణను పొందినచో అతనికి ప్రాధాన్యము లభించగలదు. కనుక ప్రతివ్యక్తియు సంస్కారములను పొంది జీవితములో విలువలను సంతరించుకొనవలసి యున్నది.

## 34. భోజనము

**తక్కువ భుజించు, ఎక్కువ కాలం జీవించు.**

ఇది యొక ఆరోగ్య సూత్రము.

మనుష్యులు సాధారణంగా ఎంత ఎక్కువ తింటే అంత బలం అనుకుంటారు. పొట్టనిండి ఆయాసం వచ్చేటట్లు తింటారు. ఇది మంచి పద్ధతి కాదు.

తినడం కంటె తిన్న ఆహారం జీర్ణం చేసుకోవడం ఎక్కువ అవసరం. తగినంత కాయకష్టం చేయకుండా అధికంగా తినకూడదు. అందుచేత తక్కువగా భుజించాలి. దాదాపు కడుపులో మూడింట రెండు వంతుల భాగాన్ని ఆహారంతో నింపి ఒక వంతు ఖాళీగా వుంచాలి. అలా వుంచినట్లయితే జీర్ణకోశం చురుకుగా పనిచేయగలుతుంది. మనిషి ఎక్కువ కాలం జీవించ గలుగుతాడు.

**35.** **వ్యసనాలకు బానిసయై**
**పసిడిని కోల్పోవు నరుడు**
**పగటిపూట చంద్రునివలె**
**పాలిపోడె కళలు తరిగి**

రహీం అను సుప్రసిద్ధ హిందీకవి రచనకు ఇది తెలుగు అనువాదం.

మానవుడు త్రాగుడు, జూదము, పేకాట మొదలగు వ్యసనములకు అలవాటు పడుతాడు. మొదట్లో కాలక్షేపం కొరకు, పొద్దుపోవుటకు ఈ దురభ్యాసాలలో ప్రవేశిస్తాడు. క్రమంగా వాటికి అలవాటుపడతాడు. కొంతకాలానికి వాటిని వదలిపెట్టి రాలేక వాటిలో చిక్కుకుంటాడు. ధనమును, ఆరోగ్యమును, గౌరవమును కూడ కోల్పోతాడు.

ఈ వ్యసనముల వలన మనుష్యుడు పగటిపూట చంద్రునివలె ముఖంలో కాంతిని కోల్పోతాడు. సమాజంలో అతన్ని ఎవరూ గౌరవించరు. జీవితం వ్యర్థమవుతుంది. కనుక వ్యసనాలకు లోనుకాకూడదు.

## 36. తృప్తి

**మనిషి ఎప్పుడూ తనకున్న సంపదతో తృప్తిపడాలి;**
**తనకున్న విజ్ఞానంతో తృప్తి పడగూడదు.**

ఇదొక చక్కని సూక్తి. మానవునికి తనకుగల సంపద, ఆస్తి పాస్తుల ఎడ సంతృప్తి వుండాలి. ఇంకా ఇంకా సంపద

కావలెనని వెంపర్లాడగూడదు. తన కంటె పేదవారితో పోల్చుకుని ఉన్న సంపదతో సంతుష్టి చెందాలి.

తనకు గల విద్య యెడల తృప్తి పడగూడదు. ఇంకా ఇంకా విజ్ఞానం కావాలనే వాంఛ అతనికుండాలి. విజ్ఞానం అనంతమైనది. కనుక దానిని పొందడంలో తృప్తిపడ గూడదు. జీవితాంతం జ్ఞానసముపార్జనకై కృషి చేయాలి.

## 37. పుస్తకములు

**పుస్తకములమీద ప్రేమ లేని గొప్ప ఐశ్వర్యవంతుడు గూడ పరమ దరిద్రుడే. నిధులలోకెల్ల నిధి యైన పుస్తక ప్రియత్వాన్ని కలిగియున్న నిరుపేదగూడ మహా ధనవంతుడే.**

ఒకడికి చాలా ఐశ్వర్యమున్నది. కాని అతనికి పుస్తకాలంటే ఇష్టం లేదు. పుస్తకాలను చదవడు. అలాంటివాడు పరమ దరిద్రుడితో సమానం.

మరొకడు నిరుపేదగా వున్నాడు. కాని అతనికి పుస్తకాలంటే చాల యిష్టం. గ్రంథ పఠనముతో కాలం గడుపుతాడు. నిరంతరం జ్ఞానార్జన చేస్తూ వుంటాడు. అన్నిటికంటె పెద్ద నిధియైన పుస్తక ప్రియత్వాన్ని కలిగి

యున్నాడు. అందుచేత అతడు మహాధనవంతునితో సమానుడు.

## 38. ఆనందానికి మార్గం

**మానవుడు ఆనందం అనుభవించాలంటే అతనికి రెండు విషయాలు కావాలి. అవి ప్రేమ, జ్ఞానము.**

బెట్రాండ్ రస్సెల్ అను ఆంగ్లేయ మేధావి ఈ వాక్యం చెప్పాడు.

ప్రతివ్యక్తి ఆనందం కోరుతాడు. హాయిగా జీవించాలనుకుంటాడు.

అలా ఆనందంగా జీవించాలంటే అతనికి రెండు విషయాలు కావాలి. మొదటిది ప్రేమ. అతడు ఇతర వ్యక్తులను, ప్రాణులను ప్రేమగా చూడాలి. ఇతరులు అతన్ని ప్రేమతో పలకరించాలి. పరస్పరం ప్రేమతో మేలగడమే ఆనందాన్ని పొందే మార్గం. ఇక రెండవది జ్ఞానము. ఆ వ్యక్తి నిరంతరం జ్ఞానాన్ని సముపార్జించుకుంటూ వుండాలి. జ్ఞానం ఒక జ్యోతి లాంటిది. అట్టి జ్ఞానంతో అతడు తన మనసులోని అంధకారాన్ని పారద్రోలుతూ వుంటాడు. ఆనందంగా జీవించాలంటే ప్రేమ, జ్ఞానము అనేవి రెండూ అవసరం.

## 39. పని నేర్పాటు

**ఒకనికి నీవు చేపను దానం చేస్తే**
**అతడు దాన్ని ఒక్కసారి భుజిస్తాడు**
**నీ వతనికి చేపలు పట్టడం నేర్పితే**
**జీవితాంతం అతడు భుజించగలడు.**

ఒక పేదవాడు వాకిట్లోకి వచ్చి అన్నంపెట్టమని అడిగాడు. అతనికి తినడానికి ఒక చేపను ఇచ్చారు. అతడా చేపను భుజించి ఆ ఒక్కరోజు ఆకలి తీర్చుకున్నాడు.

అలాగాక అతనికి చేపలు పట్టడం గనుక నేర్పినట్లయితే అతడు జీవితాంతం భుజించగలుగుతాడు. అందుచేత ఒక వ్యక్తికి ఏదైనా దానం చేయడం కంటె పనినేర్పడం మంచిది. అతని కాళ్ళమీద అతడు నిలబడి జీవించ గలుగుతాడు.

## 40. దీపము

**ఒక దీపంతో ఇంకో దీపం వెలిగిస్తే**
**మొదటి దీపం కాంతి ఏమీ తగ్గదు.**

ఇది మనందరికీ అనుభవమే. దీపావళి పండుగనాడు ఒక ప్రమిదను వెలిగించి దానితో మిగతా ప్రమిదలను వెలిగిస్తాము. అలా వెలిగించినపుడు మొదటి దీపం యొక్క కాంతి ఏమీ తగ్గదు.

అలాగే విద్యగూడాను. ఒక ఉపాధ్యాయుడు ఒక బాలునికి విద్యబోధిస్తే ఆ ఉపాధ్యాయుని మనస్సులో వున్న జ్ఞానం ఏమీ తగ్గదు.

దీపము, జ్ఞానము ఒకేరకమైనవని. దీపము బయటి అంధకారమును తొలగిస్తుంది. జ్ఞానము మనుష్యుని మనస్సులో గల అంధకారాన్ని తీసివేస్తుంది. అందుకే జ్ఞానమును జ్యోతిగా వర్ణిస్తారు.

## 41. పని -2

**శ్రద్ధగా పనిచేయువారు ఏలుబడి చేయుదురు**
**సోమరులు వెట్టిపనులు చేయవలసి వచ్చును.**

ఇది బైబులులోని వాక్యము.

మానవుడు క్రియాశీలి. అతడు సోమరితనమును దూరము చేసుకొని శ్రద్ధగా పనులు చేయడం అలవరచుకోవాలి. అట్లుగాక సోమరిగా యున్నచో జీవితము వ్యర్థము కాగలదు.

శ్రద్ధగా పనులు చేయువారు వృద్ధిలోకిపోయి ఉన్నత పదవు లలంకరించి పరిపాలకులవుతారు. సోమరులు అధములుగా వుండి వెట్టిచాకిరీ చేసి జీవించవలసి వస్తుంది.

కనుక మానవుడు నిరంతర క్రియాశీలిగా రూపొందాలి. అలసత్వమును దరిజేరనీయరాదు.

## 42. శీలములేని విద్య నిరర్థకం

**శీలసంపద పెంపొందించ లేని విద్య పరిమళము లేని పువ్వులాంటిది. అట్టి విద్య నిరర్థకం, అనర్థకం.**

ఈ చక్కని వాక్యమును మహాత్మాగాంధీ చెప్పినారు.

ఈ రోజుల్లో ప్లాస్టిక్ పూలు వస్తున్నాయి. అవి చూడడానికి పువ్వులేగాని వాటిలో పరిమళముండదు. మార్దవముండదు. రంగు కాగితాలతో చేసిన పూలమాదిరిగా కళ్ళకు కనిపిస్తూ వుంటాయి. ముక్కుదగ్గర పెట్టుకుంటే సువాసనరాదు.

అలాగే విద్యార్థిలో శీలము పెంపొందించలేని విద్య గూడ సర్టిఫికెట్లు ఇప్పిస్తుందేగాని మంచినడతను అలవరచదు. శీలము అనగా శ్రద్ధ, పట్టుదల, నమ్రత, సత్యనిష్ఠ, కర్తవ్య దీక్ష, కృతజ్ఞత, దేశభక్తి మున్నగు సద్గుణములు. ఇట్టి శీలమును పెంపొందించని విద్య నిరుపయోగకరమేగాక ప్రమాదకరమైనది గూడాను. విద్యాబోధనతో బాటు శీల నిర్మాణంగూడ జరగాలి. అప్పుడే అది సద్విద్య అవుతుంది.

## 43. మానవత్వం ఆవశ్యకత

**మనుష్యుడు పక్షివలె ఆకాశంలో ఎగరడం నేర్చాడు; చేపవలె నీటిలో ఈదడం నేర్చాడు; కాని మానవునివలె భూమిమీద మెలగడం నేర్వలేదు.**

ఈ వాక్యమును బెర్ట్రాండ్ రస్సెల్ అను మేధావి చెప్పినాడు.

నాగరికత పెరిగింది. విజ్ఞాన శాస్త్రములభివృద్ధి చెందినవి. విమానములను కనిపెట్టారు. మానవుడు ఆకాశములో విమానయానం చేస్తున్నాడు. పక్షివలె గాలిలో ఎగురుతూ వేలకొలది మైళ్ళు కొద్ది గంటలలో ప్రయాణిస్తున్నాడు. అలాగే సముద్రముమీద నౌకలలో ప్రయాణించడమేగాక సముద్రము లోపలగూడ ప్రయాణించే సబ్ మెరైన్‌లను కనిపెట్టారు. ప్రాణవాయువు గల రబ్బరు సంచులను వెంటదీసుకొని చాల రోజులపాటు నీటి అడుగున ఉండగలుగుచున్నాడు.

కాని భూమిమీద మానవులవలె పరస్పరం మెలగడం నేర్చుకోవడం లేదు. స్త్రీలపై అత్యాచారాలు చేయడం, తోటి మనుష్యులను దగాచేయడం, హత్యలుచేయడం అనుదినం జరుగుచున్నది. ఇంత నాగరికత పెరిగినప్పటికీ ఎవరి యింట్లో వాళ్ళు హాయిగా ఉండలేక పోతున్నారు. దొంగలు,

హంతకులు స్వేచ్ఛగా విహరిస్తున్నారు. నేరాలు పెరిగి పోతు న్నాయి. భూమిమీద వాతావరణం కలుషిత మవుతున్నది. ఇటీవల జరిగిన ఇరాక్ యుద్ధంలో పెట్రోలు బావులు మండడం వలన అనేక విషవాయువులతో ఆకాశం నిండి పోయింది. భూమిమీద బ్రతుకే భారమవుతున్నది.

మనుష్యునిలో మానవత్వం నశించి క్రూరత్వం పెచ్చు పెరుగుతున్నది. దీనిని అరికట్టాలి. భూమిమీద మనుష్యులు పరస్పరం ప్రేమానురాగాలతో మెలగడం నేర్చుకోవాలి.

## 44. ఎందుకు?

**నిజాయితీతో పనిచేసే ఆరుగురు సేవకుల్ని పెట్టు కున్నాను**
**నాకు తెలిసినది అంతా వారే నాకు బోధించారు**
**వారి పేర్లు: ఏమిటి? ఎందుకు? ఎపుడు? ఎట్లు? ఎచట? ఎవరు?** [7]

ఇది రుడియర్డ్ కిప్లింగ్ అనే ఆంగ్ల కవి వ్రాసిన పద్యం. ఇందులో జ్ఞానానికి మూలస్థానం ఏమిటో ఆయన చక్కగా పేర్కొన్నారు.

---

[7] I have six honest serving men,
They taught me all I knew;
Their names are: what and why,
Where and when, how and who.
—Rudyard Kipling

ఆయనకు ఆరుగురు సేవకులున్నారట. వారు చాల నిజాయితీతో పనిచేస్తారట. ఆయనకు తెలిసిన విజ్ఞానం యావత్తూ వారే బోధించారట.

ఇంతకూ వారెవరు? మనుషులుకారు. అవి ప్రశ్నలు. వ్యక్తి తనకుతాను ప్రశ్నించుకోవడం వలన ఇంత విజ్ఞానం వెలువడింది. ఇది ఏమిటి ? ఇది ఎందుకు జరిగినది ? ఇది ఎపుడు జరిగినది? ఈ పని ఎలా జరిగింది? ఇది ఎచట జరిగినది? దీనిని ఎవరు చేశారు? అనే ప్రశ్నలు వేసుకోవడం ద్వారా చరిత్ర, రాజకీయశాస్త్రము, ఆర్థిక శాస్త్రము మొదలగు సామాజిక శాస్త్రములు పెంపొందినాయి. అంతేగాక రసాయనిక శాస్త్రము, వృక్ష శాస్త్రము, జంతు శాస్త్రము, పదార్థ విజ్ఞాన శాస్త్రము మొదలగు ప్రకృతి శాస్త్రములు గూడ వృద్ధిచెందాయి. కనుక విద్యార్థి విజ్ఞానము పొందుటకై ఇట్టి ప్రశ్నలు వేసుకొనవలసి యున్నది. ప్రశ్నించడం ద్వారానే జ్ఞానము లభ్యమవుతుంది.

## 45. భోజనము

**భుజించడం కోసం జీవించ గూడదు**

**జీవించడం కోసం భుజించాలి.**

ఇదొక చక్కని సూక్తి.

ప్రపంచంలో కీటకములు, పక్షులు, జంతువులు, జలచరములు, మనుష్యులు మున్నగు ప్రాణులెన్నో వున్నాయి,

ప్రతి ప్రాణికీ ఆకలి అనేది తప్పనిసరిగా వున్నది. ఆకలి లేని జీవి లేదు. మనుష్యులుగూడ రోజల్లా ఎక్కడెక్కడికి వెళ్ళినా భోజన సమయానికి ఆహారం పుచ్చుకుంటారు. కొందరు భోజనానికి మితిమీరిన ప్రాధాన్యమిస్తారు. ప్రతి దినం రెండు కూరలు, పప్పు, సాంబారు, పాయసం, గారెలు, గడ్డపెరుగు-ఇవన్నీ విస్తట్లో కనిపిస్తేనేగాని తృప్తిపడరు. వీటిలో ఏ ఒక్కటి లేకపోయినా బాధపడతారు; కసురుకుంటారు. అలాంటి వాళ్ళు మిగతా సమయాలలో గూడ కనపడ్డ వాటినల్లా తింటూ పొట్ట నింపుకుంటూ వుంటారు. మను గడ మింగుట కొరకే అన్నట్లు ప్రవర్తిస్తుంటారు. ఆఖరుకు అజీర్ణ వ్యాధితోనో మలబద్ధకంతోనో బాధపడి మంచ మెక్కుతారు.

మానవ జన్మ ఎత్తినది తినడం కొరకుకాదు, పని చేయడం కొరకు. నిరంతర క్రియాశీలతయే మానవుని లక్షణం. అలా పనిచేయడం కొరకు శరీరంలో ఓపిక కావాలి. ఓపిక కల్గడానికై భుజించాలి. పని ప్రధానమైనది. దానికే అగ్రస్థానం. భుజించడానికి ద్వితీయ స్థానమివ్వాలి. జీవించడం కొరకు ఎంత అవసరమో అంతే భుజించాలి. అంతేగాని భుజించడం కొరకే బ్రతకగూడదు.

## 46. కులములు రెండే

**మంచి చెడ్డలు మనుజులందున**
**యెంచి చూడగ రెండె కులములు**
**మంచియన్నది మాల యైతే**
**మాలనే యగుదున్.**

ఈ చక్కని గీతమును గురజాడ అప్పారావుగారు వ్రాశారు.

మన సమాజంలో జనులు అనేక కులములుగ ఏర్పడి వున్నారు. వీటిలో గొప్ప కులములు కొన్ని, హీనకులములు కొన్ని.

ఉన్నత కులాలకు చెందినవారు హీన కులస్థులను తక్కువగా చూస్తారు. మనిషిని మనిషిగా చూడరు. అతని గుణమును బట్టి మర్యాద చేయరు. జన్మను బట్టి ఎక్కువ తక్కువలు చూపుతారు. ఇది చాల తప్పు సంగతి.

మనుష్యుడు ఏ కులములో జన్మించినను అతని మంచి తనమును బట్టి, యోగ్యతను బట్టి గౌరవించాలి. అలా చేయనిచో అతనిని అవమానించినట్లవుతుంది. ప్రజల నడుమ సామరస్యం వుండదు. ద్వేషం, పగ, విరోధములతో ప్రజలు పరస్పరం కలహించుకోడానికి ఇది కారణ మవుతుంది.

అందుచేత గురజాడ అప్పారావుగారు ఈ గేయంలో మనుష్యులలో చాలా కులములు లేవు, రెండే కులము లున్నాయి అన్నారు. మంచివాళ్ళంతా ఒక కులం; చెడ్డ వారంతా మరొక కులం. ఇలా ఒక వ్యక్తి మంచివాడా చెడ్డ వాడా అని చూడవలెనే గాని కులాలవారీగా ఆలోచించ కూడదు. మంచి అనేది 'మాల' కులమైతే తాను 'మాల' వాడనుగానే పిలువబడుతాను అని కవి అన్నారు.

మనుష్యులలోని మంచితనాన్ని గుర్తించి వ్యవహ రించాలి. అంతేగాని వారి పుట్టుక గురించిన పరిశీలన చేయ రాదు.

## 47. సేవ

**ప్రార్థించే పెదవులకన్నా సాయంచేసే చేతులు పవిత్ర మైనవి.**

కలకత్తాలో 'నిర్మలహృదయ్' అను సేవాకేంద్రమును నిర్వహించుచున్న మదర్ థెరీసా చెప్పిన మాట యిది.

దేవుని ప్రార్థించుట అవసరమే. సకల సృష్టిని నడపు చున్న మహాశక్తి ఒకటి వున్నది. దానికే దైవమని పేరు. పెదవులతో ఆ దేవుని ప్రార్థిస్తాము. దేవుని కరుణకై పరితపిస్తాము. ఆయనను ఆర్తితో స్మరిస్తాము. ఇట్లు ప్రార్థించుట మన దినచర్యలో భాగమే.

ఐతే ఈ విశ్వమే పరమాత్మ స్వరూపము గనుక ఈ ప్రపంచములో నున్న సకల జీవరాశి దేవుని ప్రతిబింబములే. ఈ ప్రాణులకు సహాయము చేస్తే, వీటికి ఆహారం పెడితే, ఈ జీవులను ఆదుకుంటే భగవంతుని అర్చించినట్లే. కనుక ప్రాణులకు, తోటి మానవులకు సహాయం చేసే చేతులు చాల ఉత్తమమైనవి. ప్రార్థించే పెదవుల కంటె పరులకు సేవ చేసే చేతులు ఎక్కువ పవిత్రమైనవి.

నీవు మనుష్యులకు సేవ చేయవచ్చును. లేదా జంతువులకు, పక్షులకు, చెట్లకు గూడ మేలు చేయవచ్చును. చెట్లకు నీరుపోయుట, పక్షులకు ఆహారము పెట్టుట, రోగులకు మందులిచ్చుట, నిరక్షరాశ్యులకు చదువు చెప్పుట మున్నగు ఏ పనులైనను చేయవచ్చును. ఆఖరుకు ఏమీ చేయలేకపోతే చీమలకు పంచదార పెట్టవచ్చును. తాను ఇతర ప్రాణులకు ఎలా ఉపయోగపడగలనా అని ప్రతివ్యక్తీ ఆలోచించుకోవాలి.

దేవుని స్మరించుట ఒక సిద్ధాంతము వంటిది. ప్రాణులకు సేవచేయుట దాని ఆచరణ వంటిది. కేవలము సిద్ధాంతమును తెలుసుకొనినంత మాత్రమున ప్రయోజనము లేదు. దానిని సేవ ద్వారా ఆచరణలో పెట్టాలి. అపుడే జీవితానికి సార్థకత.

## 48. విద్యార్థి లక్షణం

**సుఖము కోరువాడు విద్యను వదలుకొనవలసినదే. విద్యనే కోరువాడు సుఖమును త్యజించవలసినదే. సుఖార్థులకు విద్య యెక్కడ, విద్యార్థులకు సుఖ మెక్కడ?**

సుఖములచే, అనగా విందులు, వినోదములు, సినిమాలు, సర్కసులు వగైరా వాటిచే ఆకర్షితుడగు వానికి విద్య లభించదు. అట్టివాడు విద్యను కోల్పోక తప్పదు.

ఎందరో యువకులు కళాశాల విద్యాభ్యాసము కొరకు మహానగరములకు వచ్చి, అచట గల క్లబ్బులు, డాన్సులు, జూదములు మున్నగు వాటి వలల్లో చిక్కుకొని విద్యను పోగొట్టుకొనుచున్నారు. వ్యసనములకు లోనై పరీక్షలు పోగొట్టుకున్న వారున్నారు.

అలాగే విద్యయందు ఆసక్తిగల విద్యార్థులు ఎలాంటి ఆకర్షణలకు లోనుగాక ఎన్నో శ్రమలకోర్చి ఉన్నత శ్రేణిలో ప్యాసైనవారున్నారు. అనుదినం గ్రంథాలయానికి వెళ్ళి, మూలగ్రంథములను చదివి, గురు శుశ్రూష చేసి, సజ్జన సాంగత్యముతో నూతన విషయాలను గ్రహించి విజ్ఞానపు టంచులను చేరినవారున్నారు.

విద్యార్జన, సుఖలాలసత- ఈ రెండూ పరస్పర వ్యతిరేకములు. ఒకటి వున్నచోట మరొకటి ఉండదు.

## 49. తక్కువగా మాట్లాడు

**భగవంతుడు మనకు రెండు కళ్ళు, రెండు చెవులు ఇచ్చాడు. కాని నాలుక మాత్రం ఒకటే ఇచ్చాడు. తుదివరకు మనం ఎక్కువగా వింటూ, ఎక్కువగా చూడాలనీ, స్వల్పంగా మాట్లాడాలనీ దీని భావం అయి వుంటుంది.** [8]

ప్రాచీన గ్రీసు దేశంలో ప్రసిద్ధిచెందిన తత్త్వవేత్త సోక్రటీస్. ఆయన పలికిన హితవాక్యమిది.

భగవంతుడు మనకు నాలుక ఒకటే ఇచ్చాడు. కాని చెవులు, కళ్ళు, రెండేసి యిచ్చాడు. ప్రకృతిలో కనిపించే ఈ సత్యాన్ని బట్టి ఆలోచిస్తే ఏమనిపిస్తున్నది? రెండేసివున్న కళ్ళతో ఎక్కువగా చూడాలి, చెవులతో అధికంగా వినాలి. మాటలు మాత్రం తక్కువగా మాట్లాడాలి. జీవితాంతం ఇలాగే చేయాలి.

---

[8] God has given us two eyes and two ears but only one tongue. Till the end we should bee and hear more than we speak.

—Socrates

అంటే ఏమన్నమాట? నిరంతరం కళ్ళద్వారా, చెవుల ద్వారా తెలుసుకొంటూవుండు. జ్ఞానాన్ని ఆర్జిస్తూ వుండు. అనవసరంగా నోరుపారేసుకోకూడదు, అతిగా వాగకూడదు. పరిమితంగా, అవసరం వచ్చినపుడే నోరు విప్పాలి. చాల విలువైన మాటలే మాట్లాడాలి.

## 50. మంచితనం

**నీవు మంచివాడవు కాదలిస్తే ఇతరులలోని మంచిని ప్రేమించు.**

ఇదొక చక్కని ఆంగ్ల సామెత. ఇందులో ఏ వ్యక్తి అయినా ఏ రంగంలోనైనా వృద్ధిలోకి పోయే మార్గం చెప్ప బడింది.

నీవు మంచివాడవు కావాలనుకుంటావు. దానికి మార్గమేమిటి? నీ దృష్టిలో ఎవరు మంచివాళ్ళో, వారిలోని మంచితనాన్ని ప్రేమించు. అపుడా మంచితనం నీకుగూడ అలవడుతుంది.

మరొకరిలో ఒక గొప్ప గుణం వున్నది. దాన్ని చూచి ఈర్ష్యపడితే ప్రయోజనం లేదు. దాన్ని మనసార ప్రేమించితే ఆ గుణం నీకుగూడ అబ్బుతుంది. ఇదొక జీవన రహస్యం.

నీకు గొప్ప పండితుడవో, రచయితవో కావాలని వున్నది. అపుడు నీకు నచ్చిన పండితుని పాండిత్యాన్నో రచయిత యొక్క రచనలనో ప్రేమించు. అపుడు ఆ పాండిత్యం యొక్క, రచనల యొక్క ఘనతకు కారణములేమిటో నీకు స్ఫురిస్తాయి. కొంత కాలానికి ఆ సామర్థ్యం నీకుగూడ లభిస్తుంది. నీవు వారి అంతటి వాడవవుతావు. ఇదొక విజయ రహస్యం.

## 51. అణకువ

**పండ్లచే భారవంతమైన చెట్టు వంగి యుండును. నీవు ఘనుడవు కాదలచినచో అణకువ కలిగి యుండుము.**

ఈ వాక్యములు శ్రీరామకృష్ణ పరమహంస చెప్పినారు.

మామిడిచెట్టు వేసవికాలంలో పసుపుపచ్చని పండ్లను కాసి అందముగా వుంటుంది. పండ్లు క్రిందికి వ్రేలాడుతూ వుంటాయి. వాటి బరువు వలన చెట్టు కొమ్మలుగూడ వంగి వుంటాయి.

అలాగే పండితుడైనవాడు, జ్ఞానవంతుడు తన జ్ఞానం వలన అహంకారికూడదు. నమ్రతకలిగి యుండాలి. అవసరమైనపుడు మాత్రమే తన విద్యను ప్రదర్శించాలి. అణకువ కలిగియుండుట ఘనతగలవాని ప్రధానలక్షణము.

—o—

## 52. శ్రమఫలితం

**ఎముకలు విరిగేటట్లు పనిచేస్తే, దంతములు విరిగేటట్లు తినవచ్చు.**

ఇది రొక మళయాళీ సామెత. ఇందులో శ్రమించుట వలన ఫలం లభిస్తుందనే సంగతిని చక్కని రీతిలో చెప్ప బడినది. నీవు శరీరాన్ని దాచుకోకుండా, సోమరితనాన్ని విడిచి పెట్టి వళ్ళువంచి ఎముకలు విరిగేటట్లు శ్రద్ధగా పనిచేస్తే, సుష్టుగా కడుపునిండా దంతములు అరిగేటట్లు భుజించగలవు.

'కష్టేఫలీ' - కష్టపడితే ఫలముంటుంది. అనే లోకోక్తి గూడ ఇలాంటిదే. 'శ్రమ యేవ జయతే' - శ్రమవలననే విజయంలభించును అనే సూక్తిగూడ ఇదే భావాన్ని తెలుపుతుంది.

## 53. ప్రేమరథం

**ప్రేమరథానికి త్యాగము, సేవ అనునవి రెండు చక్రాలవంటివి.**

ఈ సత్యము పలికినవారు స్వామి సుందరచైతన్యానంద, మానవునికి ప్రేమకావాలి. ఈ ప్రేమ అనేరథానికి త్యాగము. సేవ అనేవి రెండు చక్రాలవంటివి. తల్లి బిడ్డను ప్రేమిస్తుంది. స్నేహితుడు స్నేహితుని ప్రేమిస్తాడు. భార్య భర్తను ప్రేమిస్తుంది. ఈ ప్రేమకు మూలము త్యాగము, సేవ. ఒకరికి జబ్బు చేస్తే మరొకరు రాత్రింబవళ్ళు దగ్గరుండి సేవ చేస్తారు. తల్లి తాను తినకుండాగూడ బిడ్డకు రుచికరమైన మధుర పదార్థాలను పెడుతుంది. ఇలా ఒకరికొరకు మరొకరు త్యాగం చేయడంవలన సేవచేయడం వలన వారిమధ్య ప్రేమ ఏర్పడు తుంది.